క్లుప్తంగా

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

అడ్డాడ(పామర్రు): పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అంగలూరు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని జెడ్పీ హెచ్ స్కూల్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి వారం విద్యార్థులకు టెస్ట్ పరీక్షలను నిర్వహించి డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నూరుశాతం ఉత్తీర్ణతకు ఒక ప్రణాళికను రూపొందించుకుని దాని ప్రకారం కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

పామర్రు: మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ అధికార భాషా సంఘం వారి ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పామర్రుకు చెందిన ప్రముఖ కవి పూలబాల వెంకటప్రసాద్‌కు 'మాతృభాషా సేవా శిరోమణి' అవార్డు అందుకున్నారు. ఈ క్రమంలో గురువారం పామర్రు కళా పీఠం, ఫ్లెక్సీ బ్యానర్స్ అసోసియేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో వెంకట ప్రసాద్, వరలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ, ఫ్లెక్సీ బ్యానర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మహాదేవ్ రాజు, విశ్రాంత ఎంఈఓ భవిరి శంకర్‌నాథ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సంగం సుబ్బారెడ్డి, హితమ్ ప్రిన్సిపాల్ ఎన్.హేమంత్‌రెడ్డి, బి.వెంకట కృష్ణారెడ్డి, హరిబాబు సాల్మన్ కొల్లాబత్తుల పాల్గొన్నారు.

వలంటీర్ల నియామకం

మండవల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ పోస్టులను భర్తీ చేసినట్లు ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఎంపీడీఓ పి.మల్లీశ్వరి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు గురువారం నియామక పత్రాలు అందజేశారు. లోకుమూడి, అయ్యవారిరుద్రవరం గ్రామాల్లో ఇద్దరు, సింగనపూడి, పెరికెగూడెం గ్రామాల్లో ఒక్కో వలంటీర్‌ను నియమించామన్నారు.

పులపర్రులో ఉపాధి పనుల పరిశీలన

మండవల్లి: మండలంలోని పులపర్రు గ్రామంలో ఉపాధిహామీ పనులను వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ గురువారం పరిశీలించారు. గ్రామంలో రూ.6 లక్షల 30 వేలుతో నిర్వహిస్తోన్న పంటబోదె పనులను ఆయన పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తున్నారని, ఇందులో భాగంగా ప్రభుత్వం ఉపాధి హామీ పనుల ద్వారా చెరువులు, పంట కాలువలు, బోదెలు అభివృద్ధి చేస్తున్నారని ఆయన తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం ధర్నా

నిడుమోలు(మొవ్వ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక నాయకులు నిడుమోలు జాతీయ రహదారిపై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, సీపీఎం కృష్ణాజిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.రఘు, మొవ్వ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజనతో బహుళ ప్రయోజనాలు

మండవల్లి: సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా బహుళ ప్రయోజనాలున్నాయని ఇండియన్ బ్యాంక్ మండవల్లి మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. స్థానిక ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో గన్నవరం కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, బ్యాంక్‌మిత్ర మద్దాల జాస్మిన్, బత్తుల సునీత, శిరీష, కరుణ పాల్గొన్నారు.

దేవపూడి ఉప సర్పంచ్ రాజీనామా

ముదినేపల్లిరూరల్: మండలంలోని దేవపూడి ఉప సర్పంచ్ బెజవాడ రామతులసమ్మ తన పదవికి గురువారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎంపీడీఓ పి.మల్లీశ్వరికి కార్యాలయంలో రాజీనామా పత్రాన్ని అందజేశారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

గుడివాడరూరల్: వలివర్తిపాడు సొసైటీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరావు మోసం చేశారంటూ దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. సేకరించిన వివరాల ప్రకారం వలివర్తిపాడు గ్రామానికి చెందిన బొడ్డు మహేష్(35), బొడ్డు రాజేశ్వరి(30)లు సహకార సంఘ అధ్యక్షుడు వద్ద పొలాల్లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో కూడగట్టుకున్న రూ.10 లక్షలు అవసరం నిమిత్తం బ్యాంక్ అధ్యక్షుడికి అప్పుగా ఇచ్చారు. శ్రీనివాసరావు కొంతకాలం సజావుగా వడ్డీ చెల్లించాడు. తాజాగా వడ్డీ విషయంలో గొడవ జరిగింది. తమను కులం పేరుతో దూషించాడని మనస్తాపం చెంది దంపతులు గురువారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉంది. దీనిపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూగజీవాలకు వరం సంజీవిని

- నియోజకవర్గంలో 612 కేసులు పరిష్కారం

నియోజకవర్గంలో ఇలా..

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	చేసిన కేసులు
కైకలూరు	1,366	1,3270	8,975	2,183	151
కలిదిండి	1,630	8762	13,990	3,590	126
మండవలి	1,219	10,144	6,210	1,250	137
ముదినేపల్లి	1,541	1,370	10,600	2,756	198
మొత్తం	5,756	33,546	39,775	9,779	612

కైకలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 108 అంబులెన్స్ ద్వారా ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే కూయ్.. కూయ్ మంటూ వాహనం పరుగులు పెడుతూ వచ్చింది. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మనుషులకే కాదు మూగజీవాలకు అంబులెన్స్ ఏర్పాటు చేసి ఒక అడుగు ముందుకు వేశారు.

గతేడాది మే 19న డాక్టర్ వైఎస్సార్ సంచార పశు వైద్యసేవలను ప్రారంభించారు. రెండో విడత ఈ ఏడాది జనవరి 25న మరో అంబులెన్సును అందించారు. నియోజకవర్గంలో దాదాపు 2,500 మంది రైతులు పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో జనవరి నెల చివరి వరకు 197 కేసులను సిబ్బంది పరిష్కరించారు. అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 194 వివిధ కేసుల్లో చికిత్సలు అందించారు.

అందుబాటులో అత్యాధునిక సేవలు

డాక్టర్ వైఎస్సార్ సంచార పశు వాహనంలో అత్యాధునిక లేబొరేటరీని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో 20 రకాల పేడ సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలైన మైక్రోస్కోప్‌ను అమర్చారు. అన్ని రకాల వ్యాక్సిన్లు నిల్వ చేశారు. ప్రతి అంబులెన్స్‌లో ట్రావిస్‌తో పాటు వెయ్యి కిలోల బరువున్నా మూగ జీవాలను తరలించేందుకు వీలుగా హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మారుమూల ప్రాంతాల్లో సైతం పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లకు కచ్చితమైన నాణ్యమైన పశువైద్య సేవలు అందుబాటులోకి రావడంపై పాడిరైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తామరకొల్లు గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

నా ఆవును బతికించారు



మా ఆవుకు ఉన్నట్టుండి విపరీతమైన జ్వరం వచ్చింది. కదలలేని పరిస్థితిలో ఉంది. టోల్ ఫ్రీ నెంబరు 1962కు ఫోన్ చేశాను. కొద్ది సమయంలోనే సంచార వైద్య వాహనం మా ఇంటికి వచ్చింది. ఆవుకు వైద్యం చేశారు. వరుసగా మూడు రోజులు ఆవుకు అవసరమైన వైద్య సేవలు అందించారు. ఆవు ఆరోగ్యంగా తిరుగుతోంది. పశువుల రక్షణకు సీఎం తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పది.

– తెలగంశెట్టి నరసింహారావు, పశుపోషకుడు, కోరుకొల్లు

ఫోన్ చేయగానే సేవలు



ఒక్క ఫోన్ చేయగానే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు అంబులెన్స్‌లు సేవలను అందిస్తున్నాయి. ప్రభుత్వం రెండో విడతలో మరో అంబులెన్స్‌ను అందించింది. దీంతో రెండు మండలాలకు ఒకటి చొప్పున వాహనాలు సేవలు అందిస్తున్నాయి. మారుమూల గ్రామాల సైతం వాహనాలు వెళ్లి మరీ సేవలు అందిస్తున్నాయి. పాడి పరిశ్రమాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ విశేష కృషి చేస్తున్నారు.

– డాక్టర్ పఠాన్ ముస్తాఫాఖాన్, వెటర్నరీ ఏడీ, కైకలూరు

పూలే విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

గుడివాడటౌన్: రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేయనున్న జ్యోతీరావు పూలే–సావిత్రిబాయ్ పూలే విగ్రహాల ఏర్పాటుకు గురువారం రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొడాలి నాని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు బడుగు బలహీన వర్గాల వారు విద్యలో అభివృద్ధి చెందారంటే జ్యోతీరావు పూలే, సావిత్రీబాయ్ పూలేలు కారణమన్నారు. యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు అయ్యే మొత్తం రూ.12 లక్షలను ఎమ్మెల్యే కొడాలి నాని అందిస్తారన్నారు. బీసీల మనోభావాలకు అనుగుణంగా నాని తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగస్తి ఆదివిష్ణు, నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహారావు, బీసీ సంఘం నాయకులు రావులకొల్లు బ్రదర్స్, దారం వెంకటేశ్వరరావు, బండారు రాధాకృష్ణ, టి.రమణకుమార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

ఏప్రిల్ నాటికి రహదారుల నిర్మాణం

గుడివాడటౌన్: రాష్ట్రంలోని అన్ని రహదారుల సమస్యలు రానున్న ఏప్రిల్‌లోగా పూర్తి చేస్తామని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ఆయన నివాసంలో నందివాడ మండలం తమిరిశ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే కొడాలి నానిని గురువారం కలిశారు. గుడివాడ నుంచి పోలుకొండ రహదారి అధ్వానంగా ఉందని, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చిన్న చిన్న రోడ్లు మరమ్మతులు, నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే రూ.2 వేల కోట్లు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, కొన్ని చోట్ల పనులు పూర్తవడం, నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ఈ ఒక్క రోడ్డు మినహా అన్ని రోడ్ల నిర్మాణాలు పూర్తయిన నేపథ్యంలో దీనిని సైతం పూర్తి చేయడానికి అంచనాలు వేస్తున్నామని ఏప్రిల్ నాటికి పూర్తిచేస్తామని అధికారులు తెలిపారన్నారు. కార్యక్రమంలో నందివాడ మండల ఎంపీపీ పెయ్యల ఆదాం, నున్న నాగేశ్వరరావు, తప్పిట సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

సీఎం జగన్ సంకల్పం సిద్ధించేలా కృషి చేయాలి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం సిద్ధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. పమిడిముక్కల మండలం వీరంకిలాకులోని ఓ కల్యాణ మండపంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులు పనిచేయాలన్నారు. మరలా వైఎస్ జగన్‌ను సీఎం చేసే విధంగా ప్రతీ ఒక్కరూ ఒక సైనికుడిలా శ్రమించాలని కోరారు. నూతనంగా ఎంపికైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వారి వారి పరిధిలో ఉన్న గృహాలకు ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వ్యక్తులకే పథకాలు అందించారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

15 నుంచి 'మా నమ్మకం నువ్వే జగన్'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

మార్చి 15వ తేదీ నుంచి 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమం నిర్వహించాలని ఎమ్మెల్యే కైలే తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టబోయే కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, కో ఆప్షన్ సభ్యుడు మీర్జా దియనత్ ఆలీ, మండల కన్వీనర్ యలమంచిలి గణేష్, ప్రధాన కార్యదర్శి ఎం.మహేశ్వరరావు, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పరాస జగన్, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, నాయకులు శొంఠి వెంకటేశ్వరరావు, శ్రీదేవి, అజీజ్, కె.రాంబాబు, పి.చంద్రపాల్, బి.చిన్న బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జయమంగళకు ఎమ్మెల్సీ కేటాయింపుపై హర్షం



కైకలూరు: మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీగా పార్టీలో అవకాశం కల్పించడం శుభపరిణామమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆటపాకలో జయమంగళ నివాసం వద్ద పలు గ్రామాల ప్రజలు ఆయనను గురువారం అభినందించారు. రాష్ట్ర మాల మహానాడు అనుబంధ సంఘాల అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబు రావు, ఏలూరు జిల్లా మాదిగ దండోరా అధ్యక్షుడు ఏసు పోగు దానియేలు, ఏలూరు జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు జక్కుల విజయ కుమార్, గుట్ల పౌలు, అందుగుల ప్రతాప్ కుమార్, భూపతి ప్రసాద్ రావు, దాకారపు నాగ రాజు, షేక్ ఉన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీ

తోట్లవల్లూరు: పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య ఆదేశించారు. మండలంలోని దేవరపల్లి, చాగంటిపాడు, తోట్లవల్లూరు, పెనమకూరు గ్రామాల్లోని పెట్రోల్ బంకులను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పెట్రో ఉత్పత్తుల నాణ్యతను, రిజిష్టర్లను తహసీల్దార్ పరిశీలించటంతో పాటు కొలతలు సక్రమంగా ఉంటున్నాయో లేదో తెలుసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ, పీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న పెద్దింట్లమ్మ జాతర

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర గురువారానికి మూడో రోజుకు చేరింది. జలదుర్గ సమేత పెద్దింటి అమ్మవారిని ఉదయం విశేషంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం ఉచిత ప్రసాదం వితరణగావించారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదం వితరణను కోళ్లపర్రుకు చెందిన కనుమూరి రంగరాజు, నాగ పార్వతి దంపతులు అందించారు. సాయంత్రం కోలాట ప్రదర్శన, తిరుపతమ్మ తల్లి బుర్రకథ ఆకట్టుకుంది. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు చెప్పారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి తీసుకువెళ్లి వారిని చైతన్యపర్చేందుకు పార్టీ నాయకులతో పాటు గృహ సారథులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ గుడివాడ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం, 34వ వార్డులోని అల్లంబడిలో వలంటీర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి గృహ సారథుల కృషి ఎంతగానో అవసరమన్నారు. ప్రతి వలంటీర్ పరిధిలో ఇద్దరిని గృహ సారథులుగా పార్టీ నియమిస్తుందని చెప్పారు. వారికి ఒక కిట్ ఇవ్వబడుతుందని అందులో ఏఏ కుటుంబానికి ప్రభుత్వం ఏఏ పథకాలు చేరవేసిందనే వివరాలు ఉంటాయన్నారు. వాటిని తిరిగి ప్రజలకు మరొక్కసారి వివరించడంతో పాటు 5 ప్రశ్నలతో కూడిన ఒక పుస్తకాన్ని అందజేస్తామన్నారు. మార్చి 18 నుంచి 25వ తేదీ వరకు ప్రతి లబ్ధిదారుడిని గృహ సారథులు కలుస్తారన్నారు. తద్వారా జగన్ మోహన్‌రెడ్డి ఆశించిన విధంగా రాష్ట్రంలో 175కు 175 ఎమ్మెల్యే స్థానాలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని చెప్పారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహారావు, వంగలపూడి కనకబాబు, మల్లిపూడి శ్రీనివాస చక్రవర్తి, మాదాసు వెంకట లక్ష్మి, జ్యోతుల సత్యవేణి, వార్డు కన్వీనర్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.



గుడివాడలో మాట్లాడుతున్న పెదబాబు

మినుము పంటకు సాగునీరు అందిస్తాం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలో మినుము రైతుల సమస్యకు ఎమ్మెల్యే డీఎన్నార్ పరిష్కారం చూపారు. గ్రామ సర్పంచ్ అనపర్తి వడ్డి కాసులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని పార్థసారధిల ఆధ్వర్యంలో గోపాలపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన కుటుంబాలకు సంక్షేమ కరపత్రాలను ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. పలు సమస్యలను గ్రామస్తులు ఆయనకు చెప్పారు.

తాగు, సాగు నీరందిస్తాం

గడప గడపకు కార్యక్రమంలో పర్యటిస్తుండగా ఎమ్మెల్యే డీఎన్నార్‌కు పలువురు రైతులు, ప్రజలు సాగు, తాగునీరు అందించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే క్యాంప్ బెల్ కెనాల్ ద్వారా నీరందించాలని విజయవాడ నీటి పారుదలశాఖ ఎస్ఈకి ఫోన్‌లో కోరారు. తక్షణం నీటిని విడుదల చేస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారని రైతులకు ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా గ్రామంలో రహదారులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనకదుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు గద్దె ఆనంద్ కుమార్, మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీ రామదుర్గాప్రసాద్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవి కుమార్, ఎస్ఐ మణికుమార్, ఎలక్ట్రికల్ ఏఈ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి నక్రిన్, వెలుగు సీసీ బాయమ్మ, గ్రామ సచివాలయ కన్వీనర్లు, సహాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తోన్న సంక్షేమ కార్యక్రమాలపై ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వాకాని సత్యనారాయణ, పరసా శ్రీనివాసరావు, పరసా సూర్య ప్రవీణ్, పరసా మణికంఠ ప్రశాంత్‌లకు పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే డీఎన్నార్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

భక్తిశ్రద్ధలతో మహా శాంతి తిరుమంజనం

నిమ్మకూరు(పామర్రు): మండల పరిధి నిమ్మకూరు గ్రామంలో వేం చేసి ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా గురువారం స్వామివారికి మహా శాంతి తిరుమంజనం నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహం, సర్వాగ్నికుండేషు ప్రధాన హోమాలు చేశారు. మహాశాంతి హోమం అనంతరం మహా శాంతి తిరుమంజనం జరిపించారు. పూర్ణాహుతి, సాయంత్రం సర్వాగ్ని కుండేషు, ఉక్త హోమాలు, శయనాధివాసం, స్వర దేవార్చన, హౌత్ర ప్రశంసనం, ప్రధాన హోమాలను యాజ్ఞిక బ్రహ్మలు నిర్వహించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి తెలిపారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఆలయంలో శుక్రవారం ఉదయం 7.52 నిమిషాల నుంచి 9 గంటల వరకు మీన లగ్నం నందు కుంభముల గర్భాలయమునకు వేంచేయుట బింబ కళావాహణం జరుగుతుందన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం, అనంతరం స్వామివార్లకు కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పరాశరంయోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు, రుత్విక్కులు, స్థానికులు పాల్గొన్నారు.



స్వామి తిరుమంజన సేవలో పాల్గొన్న భక్తులు

అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు

పామర్రు(పమిడిముక్కల): గ్రామంలోని అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరగా ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశించారు. పమిడిముక్కల మండలం శ్రీరంగపురం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ, బ్రోచర్‌ను అందజేశారు.

డ్వాక్రా మహిళలకు లింకేజీ రుణాలు

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దీనికి నిదర్శనమే ఏపీలోని పథకాలను ఇతర రాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని చెప్పారు. ప్రతి డ్వాక్రా మహిళా లక్షాధికారిణి కావాలనే లక్ష్యంతో లింకేజీ రుణాలను అందజేస్తున్నామన్నారు. విద్యా దీవెన వసతి దీవెన పథకాల ద్వారా విద్యార్థులకు అన్ని రకాల వసతులను కల్పిస్తున్నామన్నారు. రానున్న కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరలా అధికారంలోకి వచ్చే విధంగా అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ మీర్జా సజ్జిద్ అలీ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కొణతం శ్రీనివాసరావు, సర్పంచ్ డి.పద్మావతి, ఉప సర్పంచ్ టి.ఇస్మాయిల్, మొవ్వ ఏఎంసీ వైస్ ఛైర్మన్ కొడాలి రాంబాబు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీరంగపురంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

'ప్రజలను పక్కదారి పట్టించేందుకే తప్పుడు ఆరోపణలు'

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు ప్రజలు ఆనందిస్తుంటే వారిని పక్కదోవ పట్టించేందుకు తెలుగుదేశం నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి ఆరోపించారు. ఆయన వ్యక్తిగత కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందనే అభిప్రాయం ప్రజల్లో కల్పించేందుకు టీడీపీ నాయకులు ఓ రకమైన తప్పుడు ప్రచారాలకు తెరలేపారన్నారు. అందులో భాగంగానే గన్నవరంలో చిల్లర రాజకీయాలకు శ్రీకారం చుట్టారన్నారు. పట్టాభి, అచ్చెంనాయుడు, బుద్దా వెంకన్న, వర్ల రామయ్య వంటి బ్యాచ్‌ని తయారుచేసి అల్లర్లు సృష్టిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజల్లోకి వెళ్లాలనే ఉద్దేశంతో చేపట్టిన బాదుడే బాదుడు, ఇదేమీ ఖర్మ వంటి కార్యక్రమాలు అట్టర్‌ఫ్లాప్ అవడంతో పప్పు లోకేష్‌ని రోడ్డుపైకి వదిలేరన్నారు. అయితే జనంలో స్పందన రాకపోవడంతో చంద్రబాబునాయుడు తిరిగి రోడ్డెక్కారన్నారు. గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీపై టీడీపీ చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మరోసారి ఇదే విధానాన్ని అనుసరిస్తే మా కార్యకర్తలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

విద్యుత్ చౌర్యం చేస్తే చర్యలు

ముదినేపల్లిరూరల్: మండలంలో చెరువుల యజమానులు, గృహ వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఏఈ పేర్ని రవికుమార్ హెచ్చరించారు. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు, అన్నవరం గ్రామాల్లో పలు చెరువులు, గృహ విద్యుత్ కనెక్షన్లను గురువారం పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో చెరువుల యజమానులు అక్రమంగా విద్యుత్ మోటార్లను వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, దీనిని కట్టడి చేసేందుకు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ప్రధాన రోడ్ల వెంబడి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగించే చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామన్నారు. వడాలి నుంచి చిగురుకోట వరకు రోడ్డు వెంబడి విద్యుత్ లైన్లను అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించామని చెప్పారు.

నందివాడలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం నందివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానంలో జరగనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు గురువారం శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఉదయం 7.51 గంటలకు నూతన విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో శాంతి పూజలు, విగ్రహాలకు అభిషేకాలు, జలాధివాసం ప్రత్యేక పూజా, అభిషేకాలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా జరుగనున్న ఈ విగ్రహ ప్రతిష్ఠకు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి వారు, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, దేశిరెడ్డి రామిరెడ్డి(అర్జున్‌రెడ్డి), డి.రామబ్రహ్మారెడ్డి, డి.వంశీధరరెడ్డి, డి.వరప్రసాద్‌రెడ్డి, గుజ్జుల శ్రీనివాసరెడ్డి, సరిపల్లి ప్రకాష్‌రెడ్డి, సరిపల్లి లక్ష్మీ ఉదయ కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, రాజరాజేశ్వర శాస్త్రి పాల్గొన్నారు.



శాంతి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చెరువులపై హక్కులు కల్పించాలి

కైకలూరు: గ్రామాల్లో రజకుల చెరువులపై పూర్తి హక్కులు కల్పించాలని ఐలమ్మ రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణ కోరారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం గోపవరం గ్రామంలో సంతు గాడ్గే బాబా జయంతిని నిర్వహించారు. రజకుల లాండ్రీ షాపులకు 200 యూనిట్లు కరెంటు ఉచితంగా అచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు. నాయకులు రాము, రమాదేవి, నాగేశ్వరరావు, రాధాకృష్ణ, అంతర్వేది, దుర్గాప్రసాద్, కలిదిండి చిన్ని పాల్గొన్నారు.